క్లుప్తంగా

మల్బరీ షెడ్ల పరిశీలన



రామారావుగూడెంలో నిర్మిస్తున్న మల్బరీ షెడ్డు

దెందులూరు: మండలంలో 41 మల్బరీ షెడ్ల నిర్మాణం దాదాపు పూర్తి కావచ్చిందని మండల టెక్నికల్ అసిస్టెంట్ పి.రత్తయ్య అన్నారు. రామారావుగూడెం, మేదినరావుపాలెంలో నిర్మిస్తున్న షెడ్లను బుధవారం ఆయన పరిశీలించారు. ఎస్టీ, ఎస్సీలకు మల్బరీ సాగు నిమిత్తం నూరు శాతం సబ్సిడీ ఇస్తుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైతు సేవా కేంద్రాల్లో తహసీల్దార్ తనిఖీ



కొవ్వలిలో రైతుసేవా కేంద్రాలను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ బి.సుమతి

దెందులూరు: మండలంలో బుధవారం కొవ్వలి, దెందులూరు, పోతునూరు, కొత్తగూడెం, జోగన్నపాలెం, రామారావుగూడెం, గాలాయగూడెం, సోమవరప్పాడు గ్రామాల్లో కేంద్రాల ను తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు, రిజిష్టర్ల నిర్వహణ, కాటా, తేమ శాతం నిర్ధారించే పరికరాలను పరిశీలించి వివరాలను అగ్రికల్చర్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్లను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట దెందులూరు మండల వ్యవసాయ శాఖాధికారి గద్దె రమేష్ ఉన్నారు.

పాఠశాలల తనిఖీ



మసీదుపాడు పాఠశాలలో పరీక్ష నిర్వహణ తీరు పరిశీలిస్తున్న ఎంఈఓ ఏవీఎస్‌వీ ప్రసాద్

దెందులూరు: మసీదుపాడు ప్రాథమిక పాఠశాలలో సెల్ఫ్ అసెస్‌మెంట్ మోడల్ పేపరు పరీక్ష నిర్వహణను బుధవారం ఎంఈఓ ఏవీఎస్‌వీ ప్రసాద్ తనిఖీ చేశారు. విద్యార్థులను ఈ రోజు పరీక్ష ఏమిటని ప్రశ్నించారు. తెలుగు పరీక్ష రాస్తున్నామని విద్యార్థులు సమాధానమిచ్చారు. హాజరు శాతాన్ని పరిశీలించారు. హెచ్ఎం మాలతి, ఉపాధ్యాయులు ఉన్నారు.

పాఠశాల వద్ద చెత్త తొలగింపు



ఉన్నత పాఠశాల గోడపక్కన ఉన్న చెత్తను తొలగిస్తున్న తీస్తున్న పంచాయతీ సిబ్బంది

దెందులూరు: దెందులూరు ఉన్నత పాఠశాల పక్క ఉన్న గోడ దగ్గర వ్యాపారులు, నివాసితులు చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను కొన్ని నెలలుగా పడవేస్తున్నారు. ట్యాంకు పక్కన ఉన్న డ్రెయిన్‌లో మురుగు తీయక పోవడంతో దుర్వాసన వస్తోంది. పంచాయతీ గ్రామ కార్యదర్శి చౌదరి, సిబ్బంది బుధవారం ఉన్నత పాఠశాల గోడ వద్ద ఉన్న చెత్త డ్రెయిన్‌లో పేరుకుపోయిన మురుగును తొలగించారు. పంచాయతీ పారిశుద్ధ్య పర్యవేక్షణ మేస్త్రీ మాట్లాడుతూ స్థానిక షాపుల వారికి పంచాయతీ ఇప్పటికే ఎన్నోసార్లు నోటీసులు జారీ చేసిందన్నారు. నోటీసులు ఇచ్చినా ఉన్నత పాఠశాల గోడ పక్కనే చెత్తా, చెదారం వేస్తున్నారని ఈ సమస్య పరిష్కారానికి ప్రజల నుంచి స్పందన, సహకారం ఉండాలని కోరుతున్నామన్నారు.

దళితవాడలో రోడ్లపై మురుగు నీరు



కైకరంలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

ఉంగుటూరు: కైకరం దళితవాడలో మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. దీనికి తోడు ఇటీవల కురిసిన వర్షం నీరు పాత దళితవాడను చుట్టుముట్టింది. ఈ సమస్యను స్పందన ద్వారా గ్రామ పంచాయతీ దృష్టికి తీసుకువెళ్లినా ఎవరూ పట్టించుకోవడం లేదని చిగురుపాటి రాజేశ్వరరావు అన్నారు. విష జ్వరాలు వ్యాపించే పరిస్థితులు నెలకొన్నాయని ఆయన పేర్కొన్నారు. కైకరంలోని లోతట్టు ప్రాంతాల్లో డ్రెయిన్లు సక్రమంగా లేకపోవడంతో మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. దాంతో గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

రహదారికి శంకుస్థాపన

పెదపాడు: మండలంలోని తోటగూడెం-పునుకొల్లు గ్రామ రహదారికి బుధవారం ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ శంకుస్థాపన చేశారు. పునుకొల్లులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ కంభంపాటి సునీల్ కృష్ణ, నాయకులు ఉప్పలపాటి రాంప్రసాద్ పాల్గొన్నారు.



పోలీసులు రక్షణ కల్పించాలి



కోల్‌కతా ఆస్పత్రిలో విధుల్లో ఉన్న జూనియర్ వైద్యురాలిపై జరిగిన ఘటన దారుణం. ఆడపిల్లలు పనిచేసే ప్రదేశాల్లో రాత్రి సమయంలో పటిష్ట భద్రత కల్పించాలి. ఆస్పత్రుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతోపాటు పోలీసుల గస్తీ పెంచాలి. ఆడపిల్లలకు చిన్నతనం నుంచి దాడులు, విషమ పరిస్థితులు ఎదురైనప్పుడు ఎలా రక్షించుకోవాలో అవగాహన కల్పించాలి.

– బి.కృష్ణప్రియ ఎంఎల్‌హెచ్‌పీ భోగాపురం

భద్రత కట్టుదిట్టం చేయాలి



ఇటీవల కోల్‌కతాలో జరిగిన ఘటన పునరావృతం కాకుండా ఉండేందుకు ఆసుపత్రుల్లో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలి. జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. మహిళా వైద్యులు, ఏఎన్‌ఎంలకు అండగా నిలవడంతో పాటు అన్ని వసతులతో రక్షణ కల్పించాలి. నేరాలకు పాల్పడిన వారికి విధించే శిక్ష మరొకరికి దడ పుట్టించేలా ఉండాలి.

– డాక్టర్ షాజియా సుల్తానా, జనని హాస్పిటల్స్, ఏలూరు

వణికిస్తున్న విష జ్వరాలు

- డెంగీ, టైఫాయిడ్ బాధితులు అధికం
- వేగంగా విస్తరిస్తున్న కళ్ల కలక
- ప్రభుత్వాసుపత్రిలో ప్రత్యేక ఫీవర్ వార్డు ఏర్పాటు



కళ్ల సమస్యతో ఆసుపత్రికి వచ్చిన బాలుడికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మాధవి

పెదవేగి : సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఎవరిని కదిపినా జ్వరం, ఎక్కడ చూసినా కళ్ల కలక. ఇవే ప్రస్తుతం ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న వైరల్ వ్యాధులు. వర్షాలు విపరీతంగా కురవడంతో వాతావరణంలో మార్పులు వచ్చి జ్వర పీడితుల సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. అధికారులు ప్రభుత్వాసుపత్రులతో పాటు స్థానికంగా ఉండే పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలను అప్రమత్తం చేశారు. పీహెచ్‌సీల్లో వైద్యులను అప్రమత్తం చేసింది. రోగులకు అవసరమైన వైద్య సదుపాయాలను అధికారులు సమకూర్చుతున్నారు. గ్రామాల్లో డెంగీ, టైఫాయిడ్ కేసులు నమోదవుతున్నాయి.

రోజూ 700 మంది వరకూ రోగులు

దెందులూరు నియోజకవర్గంలో ప్రభుత్వాసుపత్రికి నిత్యం వచ్చే రోగుల సంఖ్య 600 నుంచి 700 వరకూ ఉంటోంది. వీరిలో ఇతర వైద్య చికిత్సలకు వచ్చే వారి మినహా మెడికల్ ఓపీ 200 మంది వరకూ వస్తున్నారు. వీరిలో జ్వర పీడితులు 40 నుంచి 50 మంది ఉంటున్నారు. వారికి వైద్య పరీక్షలు నిర్వ మంచి రోజుకు 10 నుంచి 20 మందిని ఇన్ పేషెంట్లుగా ఆసుపత్రిలో చేర్చుకుని వైద్య చికిత్సలు అందిస్తున్నారు.

ప్రత్యేక ఫీవర్ వార్డు

జ్వర పీడితుల సంఖ్య అధికంగా ఉండడంతో ప్రభుత్వాసుపత్రిలో ప్రత్యేక ఫీవర్ వార్డు ఏర్పాటు చేశారు. మగవారికి 20 బెడ్లు, ఆడవారికి 10 బెడ్లు ఏర్పాటు చేసి సేవలు అందిస్తున్నారు. 24 గంటలూ పూర్తిస్థాయి వైద్య చికిత్సలు అందించే విధంగా వైద్యులు, సిబ్బందికి డ్యూటీలు వేశారు. ఆసుపత్రి, పీహెచ్‌సీ, సీహెచ్‌సీలలో పూర్తిస్థాయి మందులను అందుబాటులో ఉంచారు.

అధిక సంఖ్యలో కళ్ల కలక బాధితులు

కళ్ల కలకతో బాధపడుతూ ఆస్పత్రికి వస్తున్న వారి సంఖ్యలో పెరుగుతోంది. వీరి సంఖ్య నిత్యం 50కి పైగా ఉంటోందని ప్రభుత్వాసుపత్రి వైద్యులు చెబుతున్నారు. ఈ వ్యాధి రాకుండా ముందుగా అప్రమత్తతతో వ్యవహరించాలి. ఈ కేసులు రోజురోజుకీ గణనీయంగా పెరుగుతున్నాయి. దీనికి కారణం ఇది ఒకరి నుంచి మరొకరి సోకుతోంది. చాలా మంది కళ్ల కలక అంటే వెంటనే కళ్లను నీటితో కడుక్కుంటుంటారని అయితే దానితో పాటు ముఖ్యంగా చేతులను తరచూ నీటితో, శానిటైజర్‌తో శుభ్రం చేసుకోవాలని వైద్యులు చెబుతున్నారు. ఇది అధికంగా చేతుల ద్వారానే వ్యాప్తి చెందుతుందని చెబుతున్నారు. కళ్ల కలక ఉన్నవ్యక్తి ముట్టుకున్న వస్తువును మరొకరి తాకితే, ఆ చేతుల ద్వారా వ్యాధి వస్తుందన్నారు.

జ్వరాన్ని నిర్లక్ష్యం చేయకండి



జ్వరం బారిన పడిన వారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. ఆసుపత్రికి వచ్చే వారి సంఖ్య అదే రీతిలో ఉంది. వైరల్ జ్వరాల నేపథ్యంలో ఆసుపత్రిలో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేశాం. 24 గంటలూ పర్యవేక్షణ చేస్తున్నాం. రోగులకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నాం. జ్వరం పూర్తిస్థాయిలో తగ్గిన తర్వాతే ఇంటికి పంపుతున్నాం. డెత్ రేట్ జీరో చేయగలిగాం. ఇదే విధానంలో ముందుకువెళతాం. ప్రజలు జ్వరాలను నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలి.

– డాక్టర్ మాధవి, ప్రాథమిక వైద్యశాల పెదవేగి

ధాన్యం కొనుగోలుకు మెరుగైన నిర్ణయం తీసుకోవాలి



రైతుల సమావేశంలో మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్

దెందులూరు: ధాన్యం కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం మెరుగైన విధానం తీసుకురావాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాస్ కోరారు. బుధవారం పోతునూరులో రైతు సేవా కేంద్రం సమీపంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు, కౌలురైతులు ధాన్యం విక్రయించుకునే విషయంలో ఇబ్బందులకు గురికాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు. రైతు సంఘాలతో చర్చి సరైన ధాన్యం సేకరణ విధానం తీసుకురావాలన్నారు. గోనె సంచులు, రవాణా, తేమ శాతం లెక్కింపు, తూకాలు వంటి సమస్యలు పరిష్కరించాలన్నారు. ఆక్వా రైతులు తీవ్ర నష్టాల్లో ఉన్నారని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో రైతు సంఘం సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకట కృష్ణారావు, జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు, నున్నావెంకట్రావు పాల్గొన్నారు.

డివైడర్ వద్ద సిగ్నల్ లైట్ ఏర్పాటు





నాడు: సోమవరపాడు రోడ్డు వద్ద సిగ్నల్ లేని దృశ్యం, నేడు : సిగ్నల్ లైట్ ఏర్పాటు చేసిన దృశ్యం

సాక్షి స్పందన

దెందులూరు: ఏలూరు నుంచి సోమవరప్పాడు మీదుగా జంగారెడ్డిగూడెం వెళ్లే రోడ్డులో సోమవరప్పాడు డబుల్ రోడ్డు మధ్య సిగ్నల్ లైట్ లేదు. దీంతో రాత్రి, పగటి వేళల్లో అక్కడ తరుచూ జరుగుతున్నాయి.దీనిపై సాక్షిలో ఈనెల 23వ తేదీన కథనం వెలువడటంతో ఆర్అండ్‌బీ, ఎన్‌హెచ్‌ఏ అధికారులు స్పందించారు. వేలాది మంది వాహనదారులు, ప్రయాణికులకు శాశ్వత మేలు జరిగేలా రోడ్డుపై డివైడర్ వద్ద గోడ నిర్మించి పోల్ ఏర్పాటు చేసి సిగ్నల్ లైట్ ఏర్పాటు చేశారు.ఏలూరు- జంగారెడ్డిగూడెం మధ్య ప్రయాణికులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు కొత్తశోభ



కళాశాలలో గార్డెన్ కోసం స్థలాన్ని చదును చేస్తున్న దృశ్యం

- నారాయణపురం ఎస్‌ఏఎస్ కళాశాల అభివృద్ధికి దాతల సాయం
- సెప్టెంబరు 2,3 తేదీల్లో నేక్ కమిటీ రాక



కళాశాల ముందు దాత నిర్మించిన షెడ్డు



సీసీ రహదారి నిర్మిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: దాతల సాయంతో నారాయణపురం ఎస్‌ఏఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధి చెందుతోంది. దాంతో కళాశాలలో కొత్త శోభ సంతరించుకుంది. ఆరునెలలుగా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. సుమారు రూ.25 లక్షలు విలువగల పనులు చేశారు. ఈ నేపథ్యంలో సెప్టెంబరు 2,3 తేదీల్లో నేక్ కమిటీ బృందం సభ్యులు కళాశాలను సందర్శించనున్నారు. దాంతో కళాశాలకు గ్రేడు రాబోతోంది. ప్రజల భాగస్వామ్యంతో కళాశాల అభివృద్ధి చెందుతున్న ఈ కళాశాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకారం అందించాల్సిన అవసరం ఉంది. ఆరునెలల్లో కళాశాల తరగతి గదులు రూపు దిద్దుకున్నాయి. సైకిల్ షెడ్డు, క్యాంటీన్ నిర్మించారు. కళాశాల ముందుభాగంలో కళాశాల నిర్మాత మూర్తిరాజు తదితరుల విగ్రహాలు తడవకుండా ఉండేలా గేటు వరకూ భారీగా రేకుల షెడ్డు సుమారు రూ.2 లక్షల వ్యయంతో చేబ్రోలుకు చెందిన దాత సాయంతో నిర్మించారు. గార్డెన్ అభివృద్ధికి ప్రత్యేకమైన మట్టిని సేకరించారు. సీసీ రహదారి అంతర్గతగా నిర్మించారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో రహదారి పనులు జరిగాయి. కళాశాల గ్రౌండును ఆధునికంగా తీర్చిదిద్దారు. కళాశాల వేదిక, ఇంటర్నల్ కన్వెన్షన్ హాలు, కంప్యూటరీకరణ ల్యాబ్, గ్రంథాలయం తదితర విభాగాలు ఆధునీకరించారు. కళాశాల అభివృద్ధి కమిటీ, పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు సహకరించారు. ప్రిన్సిపాల్ టీకే విశ్వేశ్వరరావు పర్యవేక్షణలో ఈ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

కో ఆపరేటివ్ సొసైటీ ఇన్‌చార్జి సెక్రటరీగా సత్యనారాయణ

దెందులూరు: జోగన్నపాలెం కోఆపరేటివ్ సొసైటీ ఇన్‌చార్జి సెక్రటరీగా సొసైటీలో సీనియర్ ఉద్యోగి పిట్టు సత్యనారాయణను జోగన్నపాలెం కోఆపరేటివ్ సొసైటీ సర్వసభ్య సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించిందని అఫీషియల్ పర్సనల్ ఇన్‌చార్జి వి.పవన్ చక్రవర్తి అన్నారు. బుధవారం జోగన్నపాలెం కోఆపరేటివ్ సొసైటీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ప్రస్తుత కార్యదర్శి కమ్మ నరసింహరావు ఉద్యోగ విరమణ చేస్తున్న నేపథ్యంలో సర్వసభ్య సమావేశంలో చర్చించి ఇన్‌చార్జి కార్యదర్శి నియామకాన్ని చేపట్టినట్టు చక్రవర్తి వివరించారు.

ప్రతి గ్రామంలో 200 మొక్కలు నాటాలి

దెందులూరు: ప్రతి గ్రామంలో 200 మొక్కలు నాటాలని ఈ నెల 30న నిర్వహించనున్న వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలని దెందులూరు తహసీల్దార్ బి.సుమతి అన్నారు. బుధవారం దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, మానవ మనుగడకు తోడ్పాటును అందించే మొక్కలను నాటేందుకు కలెక్టర్ పటిష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించారన్నారు. వనమహోత్సవ కార్యక్రమంలో ప్రభుత్వం ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలు భాగస్వామం కావాలని కోరారు.

కళాశాల అభివృద్ధికి సహకరిస్తాం

ఉంగుటూరు: నారాయణపురం ప్రభుత్వ కళాశాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. బుధవారం నారాయణపురం ఎస్‌ఏఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సీసీ రహదారి నిర్మాణ పనులకు ఆయన భూమి పూజ చేశారు. సర్పంచి దిడ్ల అలకానంద శ్రీనివాస్, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, ఏఎంసీ మాజీ చైర్మన్ పాతూరి విజయ కుమార్, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు పి.రాంబాబు పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ టీకే విశ్వేశ్వరావు, అభివృద్ధి కమిటీ సభ్యులు బొమ్మిడి అప్పారావు పాల్గొన్నారు.

ఘనంగా వికలాంగుల హక్కుల సమితి దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న మండల అధ్యక్షుడు ఉండ్రు బెంజిమన్, జిల్లా అధ్యక్షుడు మామిడిపల్లి నాగభూషణం

భీమడోలు: వికలాంగుల హక్కుల పోరాట సమితి 18వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు బుధవారం భీమడోలులో ఘనంగా నిర్వహించారు. జిల్లా వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు మామిడిపల్లి నాగభూషణం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఉండ్రు బెంజిమన్ కేక్ కట్ చేశారు. తొలుత జెండాను ఎగుర వేశారు. ఈ సందర్భంగా నాగభూషణం మాట్లాడుతూ వికలాంగుల హక్కుల పోరాట సమితి ద్వారానే అనేక సంక్షేమ పథకాలను సాధించుకున్నామన్నారు. మందకృష్ణ మాదిగ వికలాంగులైన ప్రతి ఒక్కరిలో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు ఈ సమితిని ఏర్పాటు చేశారన్నారు. జిల్లా కోశాధికారి నక్కా రాము, నాగేశ్వరరావు, అప్పారావు, సత్యనారాయణ, జ్యోతిశ్రీ, జోసెఫ్ పాల్గొన్నారు.

గ్రామాల్లో జ్వరాలపై సర్వే



ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తున్న ఎంపీహెచ్ఈవో కిషోర్

భీమడోలు: పూళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాల్లో జ్వరాల తీవ్రత రోజు రోజుకూ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో కొన్ని రోజులుగా గ్రామాల్లోని ప్రజలు వైరల్ జ్వరాలతో బాధపడుతున్నారు. దుద్దేపూడి, కురెళ్లగూడెం, పూళ్ల, ఎంఎం పురం, కైకరం గ్రామాల్లో జ్వరాలతో పాటు కీళ్లు, ఒళ్లు నొప్పులను బాధిస్తున్నాయి. దీనితో పూళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ ఈ.కల్యాణ్‌మహేశ్వరి, డాక్టర్ పి.అరుణల ఆధ్వర్యంలో సిబ్బంది బుధవారం ఇంటింటికీ వెళ్లి జ్వర పీడితుల వివరాలపై సర్వే చేయడంతోపాటు రక్త పరీక్షలు చేశారు. వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి వారికి మందులను ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఏడుగురు వైరల్ జ్వరాలతో బాధపడుతున్నట్లు గుర్తించారు. వారితో గ్రామాల్లో 200 మందిని కీళ్ల నొప్పులు వేధిస్తుండడంతో వారికి వైద్య పరీక్షలు చేసి మందులను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో కిషోర్, ఎంపీహెచ్ఎస్ బి.మోహనబాబు, శ్రీనివాస్, ఎఎంఎస్, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మృతుని కుటుంబాన్ని ఆదుకుంటాం

భీమడోలు: మృతుని కుటుంబాన్ని అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అందుబాటులో లేకపోవడం వల్లే ఘటన స్థలానికి రాలేదని మండల జనసేన అధ్యక్షుడు ప్రత్తి మదన్ అన్నారు. భీమడోలు రైల్వే గేటు రోడ్డులో ఆందోళన చేస్తున్న వారితో ఆయన మాట్లాడారు. ఆర్జావారిగూడెంలో జరిగిన హత్యోదంతంపై ఎమ్మెల్యే స్పందించి సీఐ, తహసీల్దార్‌కు ఫోన్ చేసి చికిత్స పొందుతున్న మహిళకు న్యాయం చేయాలని ఆదేశించారని మదన్ తెలిపారు.

కొల్లేరు రోడ్డుపై ప్రయాణం.. ప్రాణ సంకటం

- అదుపు తప్పుతున్న వాహనాలు
- భయాందోళనలో ప్రయాణికులు



మొండికోడు పరిసరాల్లో కొల్లేరు రోడ్డుపై గోతులు దాటుతున్న లారీ



మాదవాపురం వద్ద రోడ్డుపై గోతులు దాటుతున్న చోదకులు



వైఎస్సార్ సీపీ హయాంలో అభివృద్ధి చేసిన కొల్లేరు రోడ్డు (ఫైల్)

ఏలూరు రూరల్ : కొల్లేరు రోడ్డు పెద్దపెద్ద గోతులు ఏర్పడి అధ్వానంగా మారింది. దీంతో సుమారు 25 కిలోమీటర్ల దూరం ఉన్న కొల్లేరు రోడ్డు ప్రమాదాలకు నెలవుగా మారింది. వాహనచోదకులు అరచేతిలో ప్రాణం పెట్టుకుని పయనించాల్సి వస్తోంది. టీడీపీ కూటమి ప్రభుత్వం స్పందించి ఈ రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలోనే అభివృద్ధి

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కొల్లేరు రోడ్లు అభివృద్ధి చెందాయి. మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కృషితో ప్రభుత్వం సుమారు రూ.10.40 కోట్లు విడుదల చేసి రోడ్లు బాగు చేసింది. ఇందులో మొండికోడు వంతెన నుంచి పైడిచింతపాడు వరకు అధికారులు రోడ్డుకు మరమ్మతులు చేశారు. ఇందుకోసం ఎండీఆర్ నిధులు రూ.80 లక్షలు ఖర్చు చేసింది. మండల పరిషత్ నిధులు మరో రూ.1.40 కోట్లతో అధికారులు కొక్కిరాయిలంకలో పదుల సంఖ్యలో గ్రావెల్ రోడ్లు, పైడచింతపాడులో సీసీ రోడ్లు నిర్మించారు. తిమ్మారావుగూడెం, కోటేశ్వర దుర్గాపురంలో రోడ్డుకు అనుసంధానంగా సుమారు 12 లక్షలతో ఐదు కల్వర్టులు నిర్మించారు. వీటితో పాటు రూ.20 కోట్లతో కైకులూరు రోడ్డు, శ్రీపర్రు వంతెన నిర్మించారు. గతంలో పాలకులు శ్రీపర్రు రోడ్డు వేస్తామంటూ అనేక వాగ్దానాలు చేసి చేతులు దులుపుకున్న విషయం విదితమే.

కైకలూరు - కొల్లేరు రోడ్డు బాగుంది



కూటమి ప్రభుత్వం రోడ్లు అభివృద్ధి చేపట్టాలి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కొల్లేరు రోడ్డు అభివృద్ధి చేసింది. చరిత్రలో నిలిచిపోయే విధంగా కైకలూరు రోడ్డు నిర్మించింది. గతంలో ఈ రోడ్డు అభివృద్ధి చేస్తామంటూ అనేక మంది పాలకులు హామీ ఇచ్చారు. కానీ, మాట నిలబెట్టుకోలేదు. కైకలూరు రోడ్డుపై ప్రయాణిస్తుంటే ఎంతో హాయిగా ఉంటుంది. కుదుపులు లేవు ప్రశాంతంగా ప్రయాణం చేస్తున్నాం.

– మండల కొండలరావు, శ్రీపర్రు

రివిట్‌మెంట్‌తో రోడ్డు నిర్మించాలి



గత ప్రభుత్వం రెండు పక్కలా రివిట్‌మెంట్ కట్టి రోడ్డు అభివృద్ధి చేసింది. అలాగే తిమ్మారావు గూడెం నుంచి పైడిచింతపాడు వరకు రోడ్డుకు రెండుపక్కలా సిమెంట్‌తో రివిట్‌మెంట్ నిర్మించాలి. తర్వాత కొల్లేరు రోడ్డు అభివృద్ధి చేయాలి. అప్పుడే ఎక్కువ కాలం ఉంటుంది. ప్రయాణికుల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకోవాలి. టీడీపీ కూటమి ప్రభుత్వం కొల్లేరు రోడ్డు శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి చేయాలి.

– ముంగర సంజీవ్‌కుమార్, వడ్డి కార్పొరేషన్ మాజీ చైర్మన్

సమాజ సేవలు స్ఫూర్తిదాయకం

దెందులూరు: యాదవ సంఘ రాష్ట్ర నాయకులు నెరుసు వెంకట సుబ్బయ్య యాదవ్ నిర్వహిస్తున్న సమాజ సేవలు స్ఫూర్తిదాయకమని ఏలూరు పీఠం వికార్ జనరల్ డాక్టర్ ఫాదర్ పి.బాల అన్నారు. బుధవారం కొవ్వలిలో గ్రామ, మండల, యాదవ సంఘం ఆధ్వర్యంలో దెందులూరు నియోజకవర్గంలో జిల్లాలో యాదవ సంఘానికి గొర్రెలు, మేకలు పెంపకందారుల సమాఖ్యకు సమాజ సేవా రంగంలో అందించిన సేవలకు నెరుసు సుబ్బయ్య యాదవ్‌ను ఘనంగా సత్కరించారు. అనంతరం సుబ్బయ్య యాదవ్ ఫాదర్ బాలను సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వీ.శ్రీలత, గ్రామ ఉప సర్పంచ్ గోరిపర్తి కొండయ్య, డాక్టర్ అబ్రహం, బుద్ధా ట్రస్టుచైర్మన్ ఐజాక్, జిల్లా యాదవ సంఘం నాయకులు శ్రీనివాసరావు, గుళ్ళపూడి వెంకటేశ్వరరావు, కొవ్వలి గ్రామ నాయకులు పాల్గొన్నారు.

పంట నమోదు చేసుకోవాలి

పెదపాడు: రైతులు తప్పని సరిగా పంట నమోదు చేసుకోవాలని ఏలూరు వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరక్టరు వై సుబ్బారావు తెలిపారు. పెదపాడు మండలంలోని కొత్తూరులోని రైతు సేవా కేంద్రంలో ఆత్మా ఏడీఏ లలితా సుధ అధ్యక్షతన రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏడీఏ సుబ్బారావు మాట్లాడుతూ పంట నమోదుతో పాటు కౌలు రైతులు సమీపంలోని వీఆర్వో కార్యాలయంలో సీసీఆర్‌సీ కార్డులు పొందాలని సూచించారు. నాబార్డు కోఆర్డినేటర్ వర్మ, ఆత్మ ఏడీఏ లలితా సుధా మాట్లాడుతూ నాబార్డు సేవలను వివరించారు. మండల వ్యవసాయ అధికారి ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.